ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 95 మంది గైర్హాజరు

కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు 95 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాల్లో 2,334 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 95 మంది గైర్హాజరయ్యారన్నారు. 2239 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు





నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం రాత్రి బాలవికాస్ విద్యార్థులు నవవిధ భక్తిమార్గాల పేరిట ప్రదర్శించిన నృత్యరూపకం భక్తులను అలరింపజేసింది. రంగారెడ్డి జిల్లా భక్తుల సాంస్కృతిక కార్యక్రమాలు రెండోరోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా బాలవికాస్ చిన్నారులు నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. గంటపాటు భక్తిపాటలు, నృత్యంతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి యూత్‌బృందం.. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలను ఆలపించింది. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

అనంతపురం జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

09, 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లా లోని, కీర్తి రెసిడెన్సి, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ. 100/- మాత్రమే, పెద్దపులిపిరికి (**సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్టేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

సాహో.. శ్రీమంతుడా..!

జన్మభూమి రుణం తీర్చుకుంటుంటున్న మస్తాన్‌వలి

సొంత నిధులతో కొర్తికోటలో అభివృద్ధి పనులు



7

బాధితులకు చెక్కును అందిస్తున్న మస్తాన్‌వలి

సందిగ్ధం..!

ఆస్పత్రి ఏఓ జాయినింగ్‌పై అయోమయం

డిప్యూటీ కలెక్టరును నియమించిన సర్కారు

వైద్యవర్గాల్లో రెవెన్యూ పెత్తనంపై వ్యతిరేకత

తక్కువ కేడర్ పోస్టు ఇవ్వడంపై రెవెన్యూలోనూ గుర్రు



7

అనంతకు బోరుగడ్డ అనిల్

నాలుగో పట్టణ పోలీసుల కస్టడీలోకి..

లైట్లు ఆర్పేసి... పోలీసుల ఓవరాక్షన్...



7



గోరంట్ల రైతు సేవా కేంద్రం

ఇష్టారాజ్యం..!

రైతు సేవాకేంద్రాల ఇన్‌చార్జిలు ఆడిందే ఆట..

విధులకు రాకున్నా.. జీతాలు డ్రా..

గోరంట్ల, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవాకేంద్రా (ఆర్‌ఎస్కే)ల్లో పనిచేస్తున్న గ్రామస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి సెలవులు పెడతారు. ఆ సమయానికి కూడా వేతనాలు డ్రా చేస్తారు. సెలవులు ముగిశాక జాయిన్ అవుతారు తప్ప.. ఆఫీసుల్లో కనిపించరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, రైతు భరోసా కేంద్రా (ఆర్బీకే)లను ఏర్పాటుచేసింది. కూటమి అధికారం చేపట్టాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవాకేంద్రాలుగా మార్పు చేసింది. మండలంలో 26 ఆర్‌ఎస్కేలు ఉండగా, వాటి ఇన్‌చార్జిలుగా నలుగురు అగ్రికల్చర్ అసిస్టెంట్లున్నారు. 14 కేంద్రాలకు సిరికల్చర్, ఒకరు హార్టికల్చర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. గోరంట్ల-5 ఇన్‌చార్జి స్థానం ఖాళీగా ఉంది. వీరు మూడు శాఖలకు సంబంధించిన పనులు చేయాల్సి ఉంది. మాతృసంస్థ ఒకటి, డ్రాయింగ్ అథారిటీ మరొకరికి, వారిపై అజమాయిషీ మరొకరు చేయాల్సి వస్తుండడంతో వారి మధ్య సమన్వం కొరవడింది. మండలంలోని వడిగేపల్లి ఆర్‌ఎస్కే సెరికల్చర్ అసిస్టెంట్ దీప పనితీరుపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రాప్ బుకింగ్ నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారని ఓ ప్రజా ప్రతినిధి ఆరోపించారు. ఈ ఏడాది అక్టోబరు 13 నుంచి నవంబరు 15వ తేదీ వరకు ఆమె 44 రోజులు మెడికల్ లీవులో వెళ్లారు. పంట నమోదు సరిగా చేయకపోగా.. ఆర్‌ఎస్కేకి సంబంధించిన రూ.రెండులక్షల విలువ చేసే కాంప్లెక్సు ఎరువులు, రూ.60వేల విలువచేసే విత్తన రాగులను తన ఆధీనంలోనే ఉంచుకుని వెళ్లారు. ఇతరులకు స్వాధీనం చేయకపోగా, ఫోన్‌లో కూడా వ్యవసాయాధికారులకు అందుబాటులో లేరు. సెలవు ముగిసినా ఆమె విధులకు రాకపోవడంతో నవంబరు 18న వ్యవసాయాధికారి ఆమెకు హిందూపురం ఏడీ ద్వారా మెమో జారీ చేయించారు. దీంతో ఆమె తనను వేధిస్తున్నారంటూ నవంబరు 19న ఎంపీడీఓ కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని సమర్పించారు. గతనెల 28న మనసు మార్చుకుని రాజీనామాను ఉపసంహరించుకున్నారు. మళ్లీ జాయిన్ అవుతున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు లెటర్ ఇచ్చారు. నేటికీ ఆమె విధులకు హాజరుకాలేదని ఏఓ మునిక్రిష్ణ ఆరోపించారు. కాగా గంగంపల్లి ఆర్‌ఎస్కే ఇన్‌చార్జి సెరికల్చర్ అసిస్టెంట్ నారాయణస్వామి ఈ ఏడాది జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు 92 రోజులు గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలకోసం సెలవులో వెళ్లారు. క్రాప్‌బుక్కింగ్ చేయకుండా వెళ్లిన ఆయన పరీక్షలు వాయిదా పడినా విధుల్లో మాత్రం చేరలేదు. క్రాప్‌బుక్కింగ్ ప్రారంభించాల్సి ఉండగా, డిసెంబరు 5 నుంచి 2025 ఫిబవరి 22 వరకు 80రోజులు గ్రామ కార్యదర్శి ద్వారా ఎంపీడీఓ అనుమతితో సెలవులో వెళ్లారు. 92రోజుల సెలవుకు సంబంధించి జిల్లా సెరికల్చర్ అధికారి అనుమతి పొందాలని ఆ శాఖ ఏడీ సూచించారు. సెలవు రోజులకు సంబంధించిన జీతాన్ని డ్రాచేసినట్లు సమాచారం. ఆర్‌ఎస్కే ఇన్‌చార్జిలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుండడంతో మిగిలినవారు మాట వినని పరిస్థితుల్లో వ్యవసాయాధికారి తల పట్టుకుంటున్నారు. మండలంలో పదిమంది సచివాలయ ఉద్యోగులు ఈనెల 5వ తేదీ నుంచి దీర్ఘకాలిక సెలవు పెట్టగా, వారిలో ముగ్గురు ఆరోగ్యరీత్యా, మిగిలినవారు ఉన్నత పరీక్షలకు సిద్ధమవడానికి వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

సమాచారమే తెలుస్తోంది



ఆర్‌ఎస్కేల ఇన్‌చార్జిలు సెలవులో వెళ్లాక నాకు సమాచారం తెలుస్తోంది. మాతృశాఖల అధికారుల నుంచి తగిన సమాచారం అందకపోవడంతో శాఖాపరమైన పనులు సకాలంలో పూర్తి చేయడం కష్టంగా ఉంది. వడిగేపల్లి ఇన్‌చార్జి దీప నవంబరు 28న రీజాయిన్ అయ్యారన్న సమాచారమే తప్ప.. ఆమె జాడ కనిపించడంలేదు.

- మునిక్రిష్ణ, ఏఓ, గోరంట్ల

ఈనెల 4న దీప జాయిన్ అయ్యారు

నవంబరు 28న దీప రీజాయిన్ లేఖ ఇచ్చినా, జిల్లా ఉన్నతాధికారి అనుమతికోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈనెల 4న జాయిన్ అయ్యారు. విధులు నిర్వహిస్తున్నారు. సెలవులో వెళ్లిన రోజులకు జీతం డ్రా చేయలేదు. గంగంపల్లి నారాయణస్వామికి 92 రోజుల సెలవు దినాలకు వేతనం తీసుకున్నారు. ప్రభుత్వోద్యోగికి 150రోజులు సెలవు తీసుకునే వెసలుబాటు ఉంది. పని కుంటుపడకుండా ఆయన స్థానంలో గౌనివారిపల్లికి చెందిన కుమార్‌ను గంగంపల్లికి డెప్యుటేషన్ వేశాం. ఖాళీగా ఉంచకుండా పక్క కేంద్రాలవారికి బాధ్యతలు అప్పగిస్తాం.



-నరేంద్రకుమార్, ఎంపీడీఓ, గోరంట్ల

చీటింగ్ కేసులో ముగ్గురు

వైసీపీ నాయకుల అరెస్టు



జగన్‌తో శ్రీనివాసులనాయుడు (కుడివైపున ఉన్న వ్యక్తి)



జగన్‌తో నీలకంఠారెడ్డి (ఎడమ వైపు)

తనకల్లు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వైసీపీ నాయకులు శ్రీనివాసులనాయుడు, దుసాని నీలకంఠారెడ్డి, నాగమల్లిరెడ్డిని చీటింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ గోపి ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులనాయుడు, దుసాని నీలకంఠారెడ్డిది మండలంలోని కొక్కంటి గ్రామం కాగా, నాగమల్లిరెడ్డిది కొండవెనుకపల్లి. చండీఘడ్‌కు చెందిన చెందిన సునిత్ నందా మండలంలో పలుచోట్ల భూములు కొనుగోలు చేశాడు. బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఉంటున్నవారిని మభ్యపెట్టి తన భూముల్లో పండ్లతోటల పెంపకం చేపడతాననీ, పెట్టుబడి పెట్టేవారికి ప్రతినెలా రూ.15వేల దాకా ఆదాయం ఇస్తానని చెప్పాడు. దీంతో చాలామంది భూములను రిజిస్ట్రేషన్ చేసుకుని, పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడులు పెట్టిన వారికి తొలుత డబ్బులిస్తూ వారి నుంచి రూ.కోట్లు గడించాడు. కొండవెనుకపల్లి వద్దనున్న వ్యవసాయ పొలాలను వైసీపీ నాయకులైన శ్రీనివాసులునాయుడు, దుసాని నీలకంఠారెడ్డి, నాగమల్లిరెడ్డి మధ్యవర్తులుగా పునిత్‌నందాకు చూపించారు. ఆ భూములను బెంగళూరులో ఉన్న గోపాలశర్మజోషీకి విక్రయించడానికి పునిత్ నందా రంగం సిద్ధం చేసుకున్నాడు. ఈక్రమంలో వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారుల సహకారంతో నాగమల్లిరెడ్డి వన్‌బీ ఖాతాలో అతడికి సబంధంలేని సర్వే నంబర్లు 1531-2, 1532-1, 1677లో 1.78 ఎకరాలు, 1.6 ఎకరాలు 2.58 ఎకరాలు కలిపి మొత్తంగా 5.98 ఎకరాల భూమిని అక్రమంగా నమోదు చేయించారు. పునిత్‌నందా ద్వారా బెంగళూరులో ఉన్న గోపాలశర్మజోషీకి విక్రయించారు. తద్వారా వైసీపీ నాయకులు రూ.12లక్షలు లబ్ధిపొందారు. గోపాలశర్మ జోషీ తన భూమిని చూపించాలని రెవెన్యూ అధికారులతో సప్రందించి పొలంలోకి వెళ్లడానికి ప్రయత్నించగా ఆ భూమి వాస్తవ యజమానులు అడ్డుకున్నారు. దీంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్న గోపాలశర్మజోషీ.. పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆ మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా శనివారం రాత్రి పొద్దుపోయాక మండ్లిపల్లి మిట్ట సమీపంలోని వీఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద వైసీపీ నాయకులను అరెస్టుచేశారు.

మండల వైసీపీలో కీలకమైన కొక్కంటి శ్రీనివాసులునాయుడు, దుసాని నీలకంఠారెడ్డి, నాగమల్లిరెడ్డిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదుచేయడం చర్చనీయాంశమైంది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు.. అధికారులతో కుమ్మక్కై విచ్చలవిడిగా భూఅక్రమాలకు పాల్పడ్డారు.

భూఆక్రమణదారుల్లో వణుకు

వారందరిలో వైసీపీ నాయకుల అరెస్టుతో వణుకు మొదలైంది. ఎప్పుడు, ఎవరిపై కేసులు నమోదు చేస్తారోనని భయపడిపోతున్నారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో భూఅక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి

జిల్లా అంతటా భూపేచీలు..!

భూముల ధరలకు రెక్కలు

- పుట్టుకొస్తున్న వివాదాలు
- తహసీల్దార్ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఫిర్యాదులు
- రెవెన్యూ సదస్సుల్లో అర్జీల వెల్లువ



పుట్టపర్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ ఊరికెళ్లినా భూపేచీలే. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వెల్లువెత్తుతున్న అర్జీలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా భూఅక్రమాలకు పాల్పడ్డారు. వారి బాధితులే రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు అధికంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా పారిశ్రామికాభివృద్ధి పరంగా పరుగులు పెడుతోంది. ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. జాతీయ రహదారుల విస్తరణ, గ్రామీణ రోడ్ల అభివృద్ధితో అందరిచూపు జిల్లా వైపు మళ్లింది. కొన్నేళ్ల కిందట పల్లెల్లో ఎకరం ధర రూ.లక్షన్నర నుంచి రూ.పది లక్షలు అంటే అమ్మో.. అంతా అని నోరు వెల్లబెట్టేవారు. కొందరు భూములను కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. ఇంకొందరైతే వచ్చినకాడికి విక్రయించారు. జిల్లాలో ఇలా ప్రతి మండలంలో వేల ఎకరాల భూములు చేతులు మారాయి. 2016లో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పెనుకొండ వద్ద అంతర్జాతీయ కార్ల దిగ్గజం కియ, అనుబంధ సంస్థలు ఏర్పాటయ్యాయి. నాసెన్, బెల్, ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. జాతీయ గ్రామీణ, రహదారుల విస్తరణ, హంద్రీనీవా పథకం ద్వారా చెరువులకు కృష్ణాజలాలు వదిలారు. రెండున్నరేళ్ల కిందట పుట్టపర్తి కేంద్రంగా కొత్త జిల్లా కూడా ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేతోపాటు పలు రహదారుల నిర్మాణం, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌తో అనుసంధానం చేయడంతో ఎటుచూసినా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా పల్లెపట్నంలో భూములను వద్దనుకుని వదిలేసి వెళ్లినవారు ఇప్పుడు వాటి కోసం వస్తున్నారు. కుటుంబాల్లో ఘర్షణలు తలెత్తుతున్నాయి. భూసమస్యలు, వివాదాలపై రాజకీయ పార్టీల నేతల జోక్యం పెరిగి, పంచాయితీలకు తెరలేపుతున్నారు. పనిలో పనిగా రెవెన్యూ, పోలీసు శాఖల్లో కొందరు అధికారులతోపాటు కిందిస్థాయి సిబ్బంది భూవివాదాలను క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

పెరిగిపోతున్న భూతగాదాలు

జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికతోపాటు మండల రెవెన్యూ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల చుట్టూ భూసమస్యలు తిరుగుతున్నాయి. రెవెన్యూ శాఖలో మాయాజాలంతో ఫిర్యాదుపై ఏళ్ల తరబడి తిరగలేక అలసిపోయి ఇటీవల కొందరు రైతులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వస్తున్నారు. వారు వస్తూ ఆత్మరక్షణ కోసం కత్తులు తెచ్చుకుంటున్నారు. ఇటీవల తనిఖీల్లో రైతుల వద్ద కత్తులు దొరుకుతుండడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాయాల వద్ద తమకు నాయ్యం చేయాలంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని, ఆత్మహత్యకు యత్నించిన ఘటనలు కోకొల్లలు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ భూసమస్యలపై అర్జీలొస్తున్నాయి. ఇలా జిల్లాలో ఏ మండల రెవెన్యూ కార్యాలయం, పోలీసు స్టేషన్ వద్దకెళ్లినా భూసమస్యల ఫిర్యాదుదారులతోనే కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆస్తులు, భాగపరిష్కారంలో తేడాలు, డబుల్ అగ్రిమెంట్లు, భూహద్దులు, రోడ్లు, రెడ్‌మార్కులు, అసైన్డ్ స్థలాలు, భూముల అన్యాకాంత్రం, పొలాలకు దారి, సాగులో ఒకరు.. రికార్డుల్లో మరొకరు., రెవెన్యూ మాయాజాలం వంటివాటితో భూ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలపై పలువురు కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.

వైసీపీ నిర్వాకం

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంలో అడ్డగోలుగా అసైన్డ్ ఫ్రీహోల్డ్ నిషిద్ధ జాబితా నుంచి తప్పించి, భూములను కాజేశారు. రెవెన్యూ అక్రమాలు, రీసర్వేతో జిల్లాలో భూ సమస్యలు భారీగా పెరిగాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ఈనెల 6 నుంచి 'మీ భూమి.. మీహక్కు' పేరుతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు భూసమస్యలతో ఫిర్యాదుదారులు క్యూకడుతున్నారు. జనవరి 8వ తేదీదాకా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయిన రైతులు, బాధితులకు రెవెన్యూ సదస్సులే శరణ్యమయ్యాయి.

మళ్లీ అవే ఫిర్యాదులు..

రెవెన్యూ సదస్సుల్లో అధిక శాతం వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్లు, పేర్ల నమోదు, వన్‌బీ, అడంగల్‌లో మార్పులు, విస్తీర్ణం తేడా, రైతులకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో పేర్ల మార్పులు, భూఆక్రమణలు, ఫ్రీహోల్డ్, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే, సాగులో ఉన్నా మరొకరికి పట్టా ఇవ్వడం తదితరాలపైనే ఫిర్యాదులు వస్తున్నాయి. తొలిరోజు జిల్లావ్యాప్తంగా నిర్వహించిన 35 రెవెన్యూ గ్రామసభ సదస్సుల్లో 281 ఫిర్యాదులు వచ్చాయంటే ఏమేరకు భూసమస్యలున్నాయో అర్థం చేసుకోవచ్చు. పల్లెపట్నంలో ఉమ్మడి, పూర్వీకుల ఆస్తి, నకిలీ పత్రాలు, సాగులో ఒకరు.. రికార్డుల్లో మరొకరు, సాగులో తామున్నామంటూ, తాము కొన్నామనీ.. తమకే హక్కులున్నాయనీ, పాసుపుస్తకాలు, సర్వే, అసైన్‌మెంట్ భూములు, అనధికార లేఅవుట్లలో స్థలాల విక్రయాలు తదితర వాటితో సమస్యలు భారీగా పుట్టుకొస్తున్నాయి. జిల్లాలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికతోపాటు ఆయా మండలాల్లో పలుమార్లు ఫిర్యాదులు చేశామనీ, పరిష్కారం కాలేదంటూ అత్యధికంగా మళ్లీ రెవెన్యూ సదస్సులకు బాధితులు పరుగులు పెడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా కాకుండా పరిష్కారం చూపాలని బాధితులు కోరుకుంటున్నారు.

3271 మంది హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సెకండియర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బీటెక్, బీబీఏలో ఉచిత విద్య అందించాలనే ధ్యేయంతో సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించిన సాయిప్రూడెంట్ టెస్టుకు అనూహ్య స్పందన లభించింది. ఆదివారం స్థానిక బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో జర్మనీ అనహత సిఫ్టింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాయిప్రూడెంట్ టెస్టుకు రాష్ట్ర నలుమూలల నుంచి 3271 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అనహత షిఫ్టింగ్ ఫౌండేషన్ బీటెక్, బీబీఏ కోర్సులు పూర్తయ్యేవరకు ఉచిత విద్యను అందిస్తుంది. ఉత్తీర్ణత లిస్టును వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రకటిస్తామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ హరికృష్ణన్ తెలిపారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 20తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 13, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

కంది విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కంది విక్రయించేందుకు రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ఆదివారం ప్రకటనలో సూచించారు. జిల్లాలో కంది పంట కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కంది ఈ పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. జనవరి 15 నుంచి కంది ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ ధరకే కంది పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15న మాజీ సైనికులకు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 1962-65 యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఈ నెల 15వ తేదీన సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ... 1971 విజయ్ దివస్ 53వ సంవత్సరం యుద్ధ ముగింపు సందర్భంగా సన్మానం చేస్తున్నామన్నారు. స్థానిక వీకే భవన్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని మాజీ సైనికులు, సంఘం సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యార్థులకు సోమవారం పీఎం నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. కళాశాలలో నిర్వహించే ఈ మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఐటీఐలో ఉత్తీర్ణులై ఎన్‌టీసీ పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీలో నేడు సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌టీసీ, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, స్పోర్ట్స్, ఎన్‌సీసీ సర్టిఫికెట్లను పరిశీలిస్తారని తెలిపారు. జెడ్‌ఎస్‌టీసీ కర్నూలు ట్రైనింగ్ కళాశాలకు ఆన్‌లైన్ ప్రొఫైల్, ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్, పాస్ ఫొటోలు తీసుకెళ్లాలని సూచించారు. 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డీజిల్ మెకానిక్ ట్రేడ్, 12న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్ల విద్యార్థులకు వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. వివరాలకు 08518257025 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ బీఈడీ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సోమశేఖర్ తెలిపారు. బీఎడ్-2024 ఎంట్రెన్స్‌లో అర్హత సాధించి ఏ కళాశాలలో ప్రవేశం పొందని వారు అర్హులన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వెంటనే కోర్సు ఫీజు చెల్లించాలన్నారు. ఆసక్తిగల వారు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.



మసీదు నిర్మాణానికి సాయం చేస్తున్న మస్తాన్‌వలి

సాహో శ్రీమంతుడా..!

జన్మభూమి రుణం తీర్చుకుంటున్న మస్తాన్‌వలి... సొంత నిధులతో కొర్తికోటలో అభివృద్ధి పనులు



మస్తాన్‌వలి

పేదరికంతో పడరాని పాట్లు పడుతూ, పొట్టకూటి కోసం మహానగరానికి వెళ్లిన ఓ వ్యక్తి సినిమాల్లో చూపించిన విధంగా కొన్నేళ్ల తర్వాత శ్రీమంతుడిగా తిరిగొచ్చి ఆ గ్రామ ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడుస్తున్నాడు. కష్ట కాలంలో అండగా నిలుస్తున్నాడు. ఆలయాలు, మసీదుల నిర్మాణాలు, మరమ్మతులకు చేతనైన సాయం చేస్తున్నాడు. విద్య, వైద్యం విషయంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకొచ్చి ఆదుకుంటున్నాడు. ఆయనే తనకల్లు మండలం కొర్తికోటకు చెందిన ఎస్‌కే మస్తాన్‌వలి. పేదరికంతో కష్టాలు పడుతూ జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ బిల్డర్‌గా స్థిరపడ్డాడు. ఇప్పుడు గ్రామ అభివృద్ధి కోసం తనవంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఊరికి ఉపకారిగా నిలిచాడు.

తనకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదరికంలో పుట్టి శ్రీమంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి తాను పుట్టి పెరిగిన ఊరి రుణం తీర్చుకుంటున్నాడు. మండలం కొర్తికోట గ్రామానికి చెందిన మస్తాన్‌వలి పేదరికంతో ఇబ్బంది పడుతూ ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌కి వలస వెళ్లారు. అక్కడ తన శ్రమ, పట్టుదల కష్టాలు అధిగమించి బిల్డర్‌గా ఎదిగి అక్కడే స్థిరపడ్డారు. ఏళ్లు గడిచినా కన్న ఊరిని మాత్రం మరిచిపోకుండా తనవంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సాయం అందిస్తున్నారు. ఇప్పటికే రూ. మూడు కోట్లకు పైగా ఆయన వివిధ సేవా కార్యక్రమాలకు ఖర్చు చేశారు. తాను ముస్లిం కులంలో జన్మించినా.. రామాలయాలు, అమ్మవారి ఆలయాలు, ఇతర ఆలయాల నిర్మాణానికి రూ.లక్షల్లో విరాళాలు అందించారు. కొర్తికోట, కొండవెనుకపల్లి, తమ్మలవారిపల్లి, దుగినేపల్లి, గాండ్లపెంట, తదితర ప్రాంతాల్లో ఎన్నో ఆలయాలకు ఆయన విరాళాలు ఇచ్చారు. కొర్తికోటలో మదరసా, మసీదు నిర్మాణం చేపట్టారు. నల్లగుట్లపల్లి, కదిరి, గాండ్లపెంట, దుగినేపల్లి గ్రామాల్లో మసీదుల నిర్మాణానికి సాయం అందించారు. వందకుపైగా జంటలకు ఉచిత వివాహాలు చేయించారు. పేదల పిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

రాజకీయ ప్రస్థానంలోనూ సేవే

గత టీడీపీ పాలనలో మస్తాన్ వలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ సమయంలో కొర్తికోట పంచాయతీలో ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టింది. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవని మస్తాన్ తనవంతుగా ప్రతి మరుగుదొడ్డికి రూ.1500 చొప్పున 600కు పైగా మరుగుదొడ్ల నిర్మాణానికి సాయం చేశారు. తాను సర్పంచ్‌గా ఉన్న ఐదేళ్ల కాలంలో పంచాయతీలోని కొర్తికోట, కొండవెనుకపల్లి గ్రామాల్లో చౌకధాన్యపు డిపోల ద్వారా సరుకులన్నింటిని లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. అందుకు అయ్యే ఖర్చును తానే భరించారు. గర్భవతుల కోసం ఉమ్మడిగా సీమంతం కార్యక్రమాలు నిర్వహించి ఆడపడచులకు అన్నగా నిలిచారు. కరోనా కష్టకాలంలో తన పంచాయతీ పరిధిలోని పేదలకు నిత్యావసరాలు అందించి ఆదుకున్నారు. మస్తాన్‌వలి చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం ఆగస్టు 15న ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసింది. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఎందరికో ఆదర్శంగా నిలిచారు.



అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటూ..

సేవ చేయడంలోనే ఆనందం

నేను చేస్తున్న పనికన్నా, సేవ చేయడంలోనే ఆనందం ఉంది. నేను ఒకప్పుడు అనేక బాధలు, ఇబ్బందులు చవిచూశా. నాలాగ ఇతరులు ఇబ్బందులు పడకూడదనే చేతనైన సాయం చేస్తున్నా. నా దగ్గరకు వచ్చి సాయం కోరిన వారిని ఉత్తచేతులతో వెనక్కు పంపిన సందర్భాలు లేవు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడానికి ప్రయత్నిస్తా. జన్మభూమి రుణం తీర్చుకోవడానికి నావంతు కృషిని కొనసాగిస్తా.

- ఎస్‌కే మస్తాన్‌వలి

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఎంపీ అంబికా వినతి



ఆర్‌జీఐ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ సామాజికవర్గాన్ని షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) జాబితాలో చేర్చాలని ఆర్‌జీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బిశ్వజిత్, అడిషనల్ ఆర్‌జీఐ సునీల్‌కుమార్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలోని ఆర్‌జీఐ కార్యాలయంలో ఆ ఇరువురి అధికారులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిసి వినతి పత్రం అందజేశారు. ఏపీలో వాల్మీకిబోయ సామాజికవర్గానికి సంబంధించి చాలాకాలంగా నలుగుతున్న సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రయత్నాలు చేసినప్పటికీ షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చడంలో జాప్యం అవుతోందన్నారు. ఫలితంగా ఈ సంఘం గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మాత్రమే వాల్మీకి సామాజికవర్గం షెడ్యూల్డ్ తెగలుగా గుర్తింపు పొందిందని వివరించారు. వాల్మీకి బోయ సామాజికవర్గం విస్తృత సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చాలని సిఫార్సు చేస్తూ 2017 డిసెంబరు 2న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టగా.. ఆమోదం లభించిందన్నారు. ఈ తీర్మానం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ నివేదిక ఫలితాల ఆధారంగా రూపొందించారన్నారు. ఈ విషయం సత్యపాల్ కమిటీ నిర్వహించిన ఎథ్నోగ్రాఫిక్ అధ్యయనంలో తేలిందన్నారు. ఈ అధ్యయనాలు వాల్మీకి బోయ వర్గాల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా నిర్ధారించాయన్నారు. లోకూర్ కమిటీ గుర్తించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. ఆ సమగ్ర సమాచారాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ)కి ఈ ప్రతిపాదన సూచించారన్నారు. ఆర్‌జీఐ 2018 మే 10న ప్రతిస్పందనలో ప్రతిపాదనపై మరింత వివరణ కోరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 5న ఆర్‌జీఐ కోరిన అదనపు వివరాలను వెంటనే అందించిందన్నారు. సంఘం యొక్క కేసును మరింత ఎథ్నోగ్రాఫిక్ సాక్ష్యం, సమర్థనతో బలపరచిందనీ, ఈ ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. వాల్మీకి బోయ సమాజాన్ని అనిశ్చితిలో ఉంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి చురుకైన మద్దతు, సదుపాయంతో ఆర్‌జీఐకి వాల్మీకి బోయ సమాజంపై సమగ్ర అధ్యయనాన్ని చేపట్టాలని ప్రతిపాదిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌జీఐకి అవసరమైన అన్ని రకాల సహాయాలను అందించడానికి, అట్టడుగు వర్గాలకు సరైన గుర్తింపు, ఉద్ధరణను నిర్ధారించడానికి కట్టుబడి ఉందన్నారు. త్వరితగతిన కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆర్‌జీఐ అధికారులను కోరారు.

సామూహిక ప్రయోజనాల సాధనే

సాహిత్యం లక్ష్యం


- ఆచార్య ఎంఎం వినోదిని



ఆచార్య రాచపాళెం దంపతులకు చం.స్పందన 2023 జీవన సాఫల్య పురస్కారం అందజేసి, సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామూహిక ప్రయోజనాలను సాధించడమే సాహిత్యం లక్ష్యమని యోగివేమన విశ్వవిద్యాలయ ఆచార్యురాలు ఎంఎం వినోదిని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో సీనియర్ సాహితీవేత్త ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డికి 'చం.స్పందన 2023 జీవన సాఫల్య పురస్కారం' అందజేశారు. కార్యక్రమానికి ఆచార్య ఎంఎం వినోదిని ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ద్వారా సామూహిక ప్రయోజనాలు ఆశించిన విశిష్ట సాహితీమూర్తి ఆచార్య రాచపాళెం అనీ, ఆయన కవిత్వం మట్టిపరిమళంతో శ్రమ, భాగస్వామ్యంతో నిండిఉందని విశ్లేషించారు. విమలా శాంతి సాహిత్య సామాజిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ... సంప్రదాయ భావజాలంలో ఉన్న తెలుగుశాఖ రాచపాళెం దృక్పథం, సారథ్యం వల్ల ఆధునికమయ్యాయన్నారు. హేతుబద్ధత, శాస్త్రదృష్టి వంటి ఆధునిక భావాలు రాచపాళెం జీవితంలో, ఆయన సాహిత్యంలో ప్రతిబింబిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సాహితీకారులు షమీవుల్లా, రాధేయ, ఏలూరు యంగన్న, జెట్టి జయరాం, తరిమెల అమరనాథరెడ్డి, అంకె శ్రీనివాస్, మధురశ్రీ, ఓబులేసు, అశ్వత్థరెడ్డి, షరీఫ్, నానీల నాగేంద్ర, రియాజ్, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

రిమాండ్‌కు అక్రమార్కుడు



పట్టా.. ఫట్!

నకిలీ పట్టాల వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

అనంతపురంరూరల్,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు పంపించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సర్వే నెంబరు 194-8లో పట్టాలు ఇప్పిస్తానని కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం పేదలతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశాడు. ఈక్రమంలోనే గతంలో పనిచేసిన తహసీల్దార్ పేరితో పట్టాలు సృష్టించి వారి చేతిలో పెట్టారు. పట్టాలు పొందిన వారు రెవెన్యూ కార్యాలయంలో ఆరా తీయగా అవి నకిలీవని తెలియడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రెవెన్యూ అధికారులు నాగభూషణంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై నకిలీ పట్టాల పేరిట గుండు.. పట్టా..ఫట్.. శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈనేపథ్యంలో నకిలీ పట్టాలపై జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి పోలీసులతో విచారణ చేయించారు. రెండురోజుల కిందట కురుగుంటలోని నాగభూషణం ఇంట్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నకిలీ పట్టాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా చాలా మంది నాయకులు ఇదే విధంగా తమ వ్యవహారాలను సాగిస్తున్నారు. ఈ క్రమంలో నకిలీ పట్టాలు సృష్టించి పేదలను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలాంటి వారికి సంబంధించిన వివరాలు రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈక్రమంలోనే వారిపై పోలీసు కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయా వర్గాల్లో చర్చసాగుతోంది.

సందిగ్ధం..!

ఆస్పత్రి ఏఓ జాయినింగ్‌పై అయోమయం

డిప్యూటీ కలెక్టరును నియమించిన సర్కారు

వైద్యవర్గాలలో రెవెన్యూ పెత్తనంపై వ్యతిరేకత

తక్కువ కేడర్ పోస్టు ఇవ్వడంపై రెవెన్యూలోనూ గుర్రు

అనంతపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంతో జిల్లా సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏఓ) జాయినింగ్‌పై అయోమయం కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెవెన్యూ డిపార్టుమెంటుకు చెందిన డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డిని జిల్లా ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా నియమించారు. పదిరోజుల కిందట అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన ఇప్పటి వరకు జాయిన్‌కాలేదు. గత బుధవారం జాయిన్ అవుతానని ఫోన్‌లో చెప్పారని ఆస్పత్రి అధికారులు పేర్కొన్నారు. ఏమిజరిగిందో ఏమోకానీ ఆయన ఈ ఆస్పత్రి వైపు చూడలేదు. మళ్లీ ఏమనే సమాచారం కూడా తెలుపలేదు. దీనిపై ఆస్పత్రి, రెవెన్యూ వర్గాల నుంచి అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ డిపార్టుమెంట్‌వారిని ఆస్పత్రికి నియమించడం పట్ల వైద్యవర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ పనిచేసే డాక్టర్లందరూ గ్రేడ్-1వారే ఉంటారనీ, అలాంటి తమపై అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా గ్రేడ్-1 హోదాలో ఉన్న రెవెన్యూ ఆఫీసర్‌ను వేయడం ఏంటని వైద్యవర్గాలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాగా డిప్యూటీ కలెక్టర్లను జిల్లా ఆస్పత్రికి నియమించి, వారి అధికారాలను ఒక్క ఆస్పత్రికే పరిమితం చేయడం, అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ కిందిస్థాయి పోస్టుకు నియమించడం పట్ల రెవెన్యూ వర్గాలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే ఆస్పత్రి ఏఓగా నియమితుడైన మల్లికార్జునరెడ్డి జాయిన్ కాలేదా అనే చర్చసాగుతోంది. మరోవైపు ఏదైనా రాజకీయకోణంలో ఆయన జాయినింగ్‌కు అడ్డు పడిందా అన్న వాదన కూడా వినిపిస్తోంది. అయితే రాష్ట్రంలో దాదాపు 15 జిల్లా ఆస్పత్రులకు ఇలాగే డిప్యూటీ కలెక్టర్లను ఏఓలుగా నియమించగా పలువురు ఇప్పటికే జాయిన్ అయినట్లు ఆస్పత్రి, రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ నియమితులైన ఏఓ మల్లికార్జునరెడ్డి ఎందుకు జాయిన్‌కాలేదనేదే ప్రశ్నార్థకంగా మారింది. ఆయన ఇంకో పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లుకూడా ప్రచారం జరుగుతోంది.

పోలీసుల క్రీడాపోటీలు ప్రారంభం



టాస్ వేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసుల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభమైంది. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం అనంతపురం అర్బన్ సబ్ డివిజన్, ఏఆర్ విభాగం పోలీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ రెండు జట్ల మధ్య 15 ఓవర్ల మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 110పరుగులు చేయగా, ఏఆర్ పోలీస్ జట్టు 12.5ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాము, ఎస్ఐ రుష్యేంద్రబాబు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్‌నాయక్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

937 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 937 క్యూసెక్కుల వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 897 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

మిక్స్‌డ్ క్రికెట్ లీగ్ విజేత ఏఎస్‌వీ



ట్రోఫీతో విజేత అనంత క్రీడాగ్రామం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ లీగ్ విజేతగా అనంత క్రీడాగ్రామం (ఏఎస్‌వీ) జట్టు నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో మిక్స్‌డ్ జెండర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ క్రికెట్ పోటీల్లో అనంత క్రీడాగ్రామం రాప్తాడు, ఆత్మకూరు జట్లు తలపడ్డాయి. ఆత్మకూరు నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏఎస్‌వీ రాప్తాడు 11.2ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-10లో హిందూపురం టౌన్ విజేతగా, మడకశిర రన్నర్‌గా నిలిచింది. అండర్-8లో హిందూపురం టౌన్ విన్నర్‌గా, ధర్మవరం రన్నర్‌గా, చిలమత్తూరు తృతీయ స్థానంలో నిలిచాయి. అండర్-10 హాకీలో విన్నర్‌గా కళ్యాణదుర్గం, రన్నర్‌గా దురుదకుంట, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. హాకీ అండర్-8లో కళ్యాణదుర్గం, కళ్యాణదుర్గం బీ టీం, అనంతపురం జట్లు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అనంతరం అధికారుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోఆర్డినేటర్ వంశీకృష్ణ, ఫుట్‌బాల్ మేనేజర్ దాదాఖలందర్, కోచ్‌లు ప్రవీణ్, రఫీఅహ్మద్, చౌడేశ్వరప్రసాద్, అనీల్‌కుమార్, దేవకి తదితరులు పాల్గొన్నారు.

అనంతకు బోరుగడ్డ అనిల్

నాలుగో పట్టణ పోలీసుల కస్టడీలోకి..



బోరుగడ్డ అనిల్‌కుమార్

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. బోరుగడ్డ అనిల్ ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నగరానికి చెందిన తెలుగు మహిళ నేత ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. శనివారం ఉదయం ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, ఎస్ఐ రాంప్రసాద్.. సిబ్బందితో కలిసి అనిల్ కోసం వెళ్లారు. తెల్లవారుజామున 1.20 గంటలకు అతడిని నేరుగా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ యూట్యూబ్ చానల్‌లో కించపరిచే విధంగా మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో పెద్దగా పట్టించుకోలేదు. కేసు కూడా కట్టలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల సంగా తేజశ్విని ఇటీవల నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారు కేసు నమోదు చేశారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజులపాటు కస్టడీ కోరారు. వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించి, శనివారం నాలుగో పట్టణ పోలీసులు రాజమండ్రి కోర్టు నుంచి బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను తీసుకొచ్చారు.



పోలీసు స్టేషన్ గేటు మూసి పహారా కాస్తున్న సిబ్బంది

లైట్లు ఆర్పేసి... పోలీసుల ఓవరాక్షన్...

బోరుగడ్డ అనిల్ విషయంలో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటికే స్టేషన్ ఆవరణలో లైట్లు ఆర్పేశారు. వచ్చీరాగానే అనిల్‌ను కిందకు దింపి లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసు స్టేషన్‌కు తాళం వేశారు. ఇంటర్నేషనల్ కిల్లర్‌ను తీసుకొచ్చినట్లుగా పోలీసులు వ్యవహరించారు.



నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో వాహనాలు

తెలియదు... గుర్తు లేదు..

విచారణలో పోలీసులకు బోరుగడ్డ అనిల్ పెద్దగా సహకరించినట్లు లేదని సమాచారం. తెలియదు... పెద్దగా గుర్తులేదు.. అంటూ సమాధానమిచ్చినట్లు సమాచారం. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో నాలుగో పట్టణ పోలీసులు బోరుగడ్డ అనిల్‌ను విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. బోరుగడ్డ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా ప్రశ్నించినట్లు సమాచారం. 'నీవే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని అడిగినట్లు తెలిసింది. అనిల్ తరఫున న్యాయవాది హాజరైనట్లు సమాచారం. కాగా మొత్తం మూడు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. సాయంత్రం 5గంటలు దాటితే విచారించడానికి వీలుండదు. సోమవారం సాయంత్రం 5గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకెళ్లాలి. సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరు పరిచి, అనంతరం అతడిని తీసుకెళ్తారు. ప్రయాణ సమయం వీలుగా చూపి మంగళవారం ఉదయం రాజమండ్రి కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది.

సంక్షిప్తం

అయ్యప్ప ఆలయానికి బోరు ఏర్పాటు



బోరుకు పూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయానికి లింగాల వారిపల్లికి చెందిన భక్తుడు రైతు దేవరింటి ఓబులరెడ్డి మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆదివారం మంచినీటి బోరు వేసినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. 220 అడుగుల్లో పుష్కలంగా నీరు పడినట్లు వివరించారు. దాత ఓబులరెడ్డి, కుమారులు సాయినాథ్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను అయ్యప్ప భక్తులు, ఆలయ సంకల్పకులు సన్మానించారు.

11న అయ్యప్పస్వామి ఆలయంలో లక్షార్చన

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 11న లక్షార్చన పూజా కార్యక్రమం ఉంటుందని గురుస్వామి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5-30 గంటలకు మహాగణపతి హోమం, అయ్యప్పస్వామిపూజ, కన్నెస్వాముల లక్షార్చన పూజ కార్యక్రమం ఉంటుందని, అనంతరం 11 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 12న భజన మందిరం నుంచిగంధం అలంకారంతో అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముదిగుబ్బ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో సోమవారం విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నామని, ఈ మేరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్, డ్యామేజ్ పోల్స్, ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ద్విచక్రవాహనం ఢీ.. దంపతులకు గాయాలు

కదిరి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలేజీ సర్కిల్లో ఆదివారం ద్విచక్రవాహనం ఢీకొని మహిళలకు గాయాలయ్యాయి. గాండ్లపెంట మండలంలోని తూపల్లికి చెందిన రమణమ్మ ఆమె భర్త వెంకటరమణ కదిరిలోని బంధువుల ఇంటికి వచ్చారు. కాలేజీ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు కాలు విరగా, అతడికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స అనంతరం అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఐని కలిసిన మైనార్టీలు

ముదిగుబ్బ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివరాముడును ఆదివారం మైనార్టీలు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ శివరాముడు, ఎస్ఐ ఇషాక్ బాషాలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐను కలిసిన వారిలో మైనార్టీ నాయకులు ఖలందర్, రాళ్లపల్లిబాబాసాహెబ్, హైదర్‌వలీ,గుజిరివలి, అల్లాబకాష్,షబ్బీర్, చాంద్‌బాషా, ముస్తాక్, యాసీన్, ముభాకర్, షైను, ఇర్ఫాన్ ఉన్నారు.

ఆలయాలను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

నంబులపూలకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హిందువుల దేవాలయాలను సంరక్షించుకోవాలని, అందుకు అందరూ ఐక్యం కావాలని విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మమ్మమర్రిమాను వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయం సేవాసంగ్ సుధాకర్, వీహెచ్‌పీ మండల ఇన్‌చార్జ్ గోపాలక్రిష్ణ, ఎంపీడీఓ ఆంజనప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో జరిగే హిందూ శంఖారావం సభకు తరలి రావాలని తెలిపారు. దేవదాయశాఖ పరిధిలోని దేవాలయాలను హిందువులే సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, గణేష్‌నాయక్, జయరాములు, కళాకారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న నాయకులు

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో టీడీపీ సీనియర్ నాయకుడు సీఎండీ ఇస్మాయిల్ పంపిణీ చేశారు. ఆరుగురికి రూ.6 లక్షల 57వేల చెక్కులను అందచేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి బాధితులు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ క్రీడల్లో పీఆర్ఆర్ ఎంబీఏ కళా శాల విద్యార్థులు సత్తాచా టారు. ఈ సందర్భంగా ఆదివారం రుద్రంపేట లోని పీవీకేకే కళాశాల లో విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, క్యాంపస్ ఇన్‌చార్జ్ సంతోష్‌రెడ్డి తదితరులు వారిని అభినందించారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గుత్తి మున్సిపాలిటీలో ఉన్న పీఆర్ఆర్ ఎంబీఏ కళాశాలలో సెకెండి యర్ చదువుతున్న జైసాయి సుభాష్ రెండు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో పాటు అథ్లెటిక్ చాంపియన్‌షిప్ సాధించాడు. అదేవిధంగామొదటి సంవత్సరం విద్యార్థిని త్రివేణి జావిలిన్‌లో బ్రోంజ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పల్లె కిశోర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడారంగం వైపు ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఎల్లప్పుడూ వెనువెంట ఉంటామన్నారు.

రైతు గోడు పట్టని అధికారులు

● కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్ ● యథేచ్ఛగా చెరువులో బోర్లు ● ఆయకట్టు రైతుల ఆందోళన



సాగుచేసిన పంటలు, అక్రమ బోర్లకు విద్యుత్‌ను అందిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

తాడిమర్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చెరువును ఆక్రమించుకుని 30దాకా బోర్లు వేశారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవడంతో పాటు చెరువు భూములను కూడా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువు కింద ఉన్న అసలైన సాగుదారులకు నీరు లభించక పంటలు పెట్టుకోలేని పరిస్థితి దాపురించింది. చెరువులోని ఆక్రమణలను తొలగించాలని తాడిమర్రికి చెందిన రైతులు గత నెల 4న పుట్టపర్తిలోని నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ టీఎస్ చేతన్ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు కాపీని పంపారు. ఇరిగేషన్ అధికారులు మినహా మిగిలిన వారెవ్వరూ దానిపై స్పందించలేదని చెప్పాలి. ఇరిగేషన్ అధికారులు చెరువును పరిశీలించి 30 దాకా అక్రమ బోర్లు ఉన్నాయని, చెరువు భూమి కూడా ఆక్రమణకు గురవుతోందని సర్వే నిర్వహించి కొలతలు తేల్చాలని రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. మరోవైపు 30 విద్యుత్ అక్రమ కనెక్షన్లు చెరువులో ఉన్నాయని, వాటిని తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ఒక్క అక్రమ విద్యుత్ కనెక్షన్ తొలగించలేదు. కనీసం నోటీసు కూడా జారీ చేసిన పాపాన పోలేదు. నవంబరు 4వతేదీ తరువాత మళ్లీ చెరువులో మూడు బోర్లు వేశారంటే అధికారులు పనితీరు ఎలా ఉందో ఇట్టేఅర్థమవుతోంది. చెరువులో అక్రమంగా బోర్లు వేస్తున్నారని ఎవరైన రైతులు అధికారులకు ఫోన్‌లు చేస్తే.. ఫలానా రైతులు నీ బోర్లు ఆపాలని ఫోన్లు చేస్తున్నారని రెవెన్యూ సిబ్బంది తిరిగి బోర్లు వేస్తున్న వారికి సమాచారం చేరవేస్తున్నారు. దీంతో స్థానికంగా రైతులు గొడవ పడే పరిస్థితి వస్తోంది. ఇదే విషయమై అధికారులను ఎప్పుడు తొలగిస్తారు అని అడిగితే.. మీరూ మాతో పాటు రండి అందరం కలిసి తొలగిద్దామంటూ ఓ ఉన్నతాధికారి ఉచిత సలహా ఇస్తున్నారంటే ప్రభుత్వ కార్యాలయాల్లో పనితీరు ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చెరువును ఆక్రమించిన వారి వద్ద నుంచి ప్రభుత్వ భూములు తీసుకోవడంతోపాటు, అక్రమ బోర్లను రద్దు చేసి విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే జైలుకే: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల జోలికొస్తే జైలు తప్పదని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో వివిధ శాఖల అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూముల జోలికి వస్తే జైలు తప్పదని తెలిపారు. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం పట్టణంలో చిన్నచిన్న సందుల్లో కూడా బంగ్లాలు కడుతున్నారని, ఇది భవిష్యత్‌లో ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సామాన్యులు, మధ్యతరగతి వారు సొంత ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. అక్రమ లే అవుట్లపై ఉక్కుపాదం మోపితే డబ్బు కోసమని కొంతమంది, రాజకీయ కక్ష అని కొంతమంది, మతం పేరుతో మరి కొంతమంది రకరకాల ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పట్టణాభివృద్ధి కోసమే ఈ చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్లాట్లు వేసినా, అప్రూవల్ లేఅవుట్లే ఉండాలన్నారు. గతంలో కొందరు ఎమ్మెల్యేలు పట్టాలు అమ్ముకునే దీనస్థితిలోకి వచ్చారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుంటే, మతం రంగు పులుముతున్నారన్నారు. తప్పులు చేసిన 50 మంది దొంగలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే ప్లాట్లు వేసి, రిజిస్ట్రేషన్ కాని లేఅవుట్లపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలిపారు. దీనిపై కమిటీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే రోజుల్లో అక్రమ లే అవుట్లపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీఎస్ శర్మ, తహసీల్దార్ మురళిక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన



కదిరిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కదిరి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి అనంతపురం మార్క్ ఆసుపత్రి వైద్యులు హాజరై, రోగులను పరీక్షించారు. శిబిరంలో 189 మందికి పరీక్షలు చేయగా, అందులో 28 మందికి శస్త్రచికిత్సలకు పంపనున్నట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ నాగేష్, వైద్యులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 134 మందికి బెంగుళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి 82 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామని క్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. దాసరి చిట్టి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, హరినాథ్, శివయ్య, రత్నశేఖర్‌రెడ్డి, సుదర్శనగుప్తా, కొండయ్య, రమేశ్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



పుట్టపర్తి అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి రూరల్ పోలీసులు హెచ్చరించారు. ఆదివారం పుట్టపర్తి రూరల్ అటవీ ప్రాంతాలైన అమగొండపాల్యెం, కంబాలపర్తి, పరిసర నిర్మానుష్య ప్రాంతాలతో పాటు రూరల్ పరిధిలోని పలుప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్ వంటి అసాంఘిక కార్యాకాలపాలకు తావులేకుండా డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా చేపట్టామని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని పుట్టపర్తి రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

నంబులపూలకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో నిర్వహిస్తున్న జూద కేంద్రంపై ఆదివారం ఎస్ఐ వలిబాషా దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి రూ.24వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జూదమాడుతున్నట్లు సమాచారం అందిందని వెంటనే దాడి చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. వీరిని సోమవారం కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. ఆయనతోపాటు సిబ్బంది కిషోర్‌రెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయండి



మంత్రిని కలిసిన బీసీ నాయకులు

తనకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు పెనుకొండలో ఆదివారం బీసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మండలంలో అత్యధికంగా బీసీలు ఉన్నారని, ఆ వర్గాల విద్యార్థులకు గురుకుల పాఠశాల లేకపోవడంతో మధ్యలోనే చదువులు మానివేస్తున్నట్లు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటకొండ క్రిష్టప్ప, బీసీ నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల13 నుంచి 19 వరకు జరుగుతాయని దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. 13న స్వామివారి ధ్వజారోహణం, అంకురార్పణ, 14న స్వామివారి కళ్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం, 16నజ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 17న తలనీలాలు, 18న కంబాల నరసింహస్వామి పరుష, శయనోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న వసంతోత్సవం, స్వామి చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుడి మృతికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాలు సర్వీస్ ఉండగానే ఇలా మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి పరిహారం అందించి, ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హనుమంతరావు, రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేశ్, సాయిగణేశ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వధూవరులకు వస్త్రాల పంపిణీ



నూతన వధూవరులకు వస్త్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పర్తిసాయి ధర్మశాల ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు సంబంధించి నూతన వధూవరులకు నిర్వాహకులు వస్త్రాలను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక పర్తిసాయి ధర్మశాలలో ఈనెల 15న కొత్తచెరువు మండలం చెన్నకేశవపురంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకున్న 27 జంటలకు నిర్వాహకులు బ్రిటన్‌కు చెందిన అనీలా, అనిల్‌పటేల్ దంపతులు వస్త్రాలను పంపిణీ చేశారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



డాక్టర్ ఇర్షాన్‌కౌసర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ కరీమ్ రుమానీ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వరంలో పలువురు అవార్డు గ్రహీతలను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సన్మానించారు. ఆదివారం ఎజీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉర్దూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను, డాక్టరేట్ పొందిన ఇర్షాన్‌కౌసర్‌ను సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దండంతో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ముజఫర్‌అలీ షాహమీరి, బషీర్ అమ్మద్, అమీనుల్లాఅమీన్, అంజముల్లా మహమ్మర్‌ఇర్షాద్, ఆర్ఫీ, మోరాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై వడ్డీ వ్యాపారుల దాడి


అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కమలానగర్‌లో వడ్డీ వ్యాపారులు దాడి చేయడంతో నాగరాజు అనే వ్యక్తి ఆసుపత్రి పాలయ్యాడు. అతడి సోదరి మాధవి విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుల్జార్‌పేటలో ఉంటున్న తన సోదరుడు నాగరాజు రోజుకు రూ.5వేలు వడ్డీ ప్రకారం వడ్డీ వ్యాపారులతో రూ.లక్ష అప్పు తీసుకున్నాడ న్నారు. కొన్ని రోజులుగా డబ్బు చెల్లించకపోయాడన్నారు. ఈక్రమంలో ఆదివారం తన సోదరుడు నాగరాజు కమలానగర్‌లో ఉంటున్న తమ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో 15మంది వచ్చి దాడి చేశారని వాపోయారు. పార్వతి, జిత్తు, రాజు, లక్ష్మి, వరాలు తదితరులు దాడి చేశారని, తన సోదరుడు, తన కుమారుడికి వారి నుంచి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ఎవరికైనా ఫిర్యాదు చేస్తామని చెబితే...తాము పోలీసులను, మీడియాను మేనేజ్ చేస్తామని చెప్పారని, న్యాయం చేయాలని కోరారు. కాగా ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు చేసే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా ఎస్పీ జగదీష్ పరిధిలోని ప్రత్యేక పోలీసుల బృందం వారిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వారి వెనుక ఇంకా ఎవరెవరున్నారు..? గంజాయి రవాణాలో ఉన్న వారి పాత్రపై విచారిస్తున్నట్లు తెలిసింది.

నిరుపయోగంగా నీటిశుద్ధి కేంద్రం

● రూ.కోట్లు మంజూరైనా నెరవేరని ఆశయం ● తుప్పుపడుతున్న యంత్రాలు ● గ్రామీణులకు తప్పని ఫ్లోరైడ్ నీటి బాధలు



వృథాగా ఉన్న నీటి శుద్ధి కేంద్రం



దిష్టిబొమ్మలా నీటి శుద్ధి కేంద్రం, తుప్పుపడుతున్న యంత్రాలు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫ్లోరైడ్ రహిత నీటిని ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మండలానికి నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఓబుళదేవరచెరువు మండలం ఆకుతోటపల్లి సమీపంలో 2018లో అప్పటి ప్రభుత్వం నీటి శుద్ధి కేంద్రానికి రూ. 3 కోట్లు నిధులు మంజూరు చేసింది. వాటికి సంబంధించి అప్పట్లో టెండర్లు కూడా పిలిచారు. శుద్ధి కేంద్రాన్ని అప్పటి ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో నీటి శుద్ధి కేంద్రాల ఆశయం నీరుగాకారిపోయింది. ప్రస్తుతం నీటిశుద్ధి కేంద్రంలో అమర్చిన యంత్ర పరికరాలు నిరుపయోగంగా ఉండడంతోపాటు తుప్పు పడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం రావడంతో నిధులు రాకపోవడంతో ఈ పథకం ముందుకు సాగలేదు. నీటి శుద్ధి కేంద్రం లేకపోవడంతో గత్యంతరం లేక ప్రజలు ఫ్లోరైడ్ నీటిని తాగాల్సి వస్తోంది. మరికొంత మంది స్థానికంగా ఉండే నీటి ప్లాంట్లలో రూ. 10 నుంచి రూ.12 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పంచాయతీ నీరు తాగడంతో ఫ్లోరైడ్ బారిన పడి నొప్పులతో అల్లాడిపోతున్నామని మరికొందరు గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిష్టిబొమ్మల్లా ఉపకేంద్రాలు

ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద మండలంలోని ఆకుతోటపల్లి వద్ద ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రం నుంచినీటిని అందించడానికి 11 గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు ఆరేళ్ల గడుస్తున్నా నీరు గ్రామాలకు చేరలేదు. ఉప కేంద్రాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. నీటి ఉపకేంద్రాల్లో కాయిన్ బాక్స్ ద్వారా రూ. రెండు చెల్లిస్తే బిందెనీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. పథకం ఆశయం కొనసాగకపోవడంతో నీటి ఉపకేంద్రాలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పథకాన్ని పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తక్కువ ధరకే నీరు అందించాలి



గత టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద అమలు చేసిన రెండు రూపాయలకే బిందె నీరు అందిచేలా చూడాలి. శుద్ధ నీరు లేకపోవడంతో గత్యంతరం లేక ఫ్లోరైడ్ నీటిని తాగాల్సి వస్తోంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. శుద్ధినీటిని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- రామాంజనేయులు, బాబాసాహెబ్‌పల్లి

ఫ్లోరైడ్ నీటితో నొప్పులు



ఫ్లోరైడ్ నీటిని తాగి మోకాళ్ల నొప్పులతో అల్లాడిపోతున్నాం. మాలాంటి వృద్ధులు కనీసం నడవడానికి కూడా వీలులేకుండా పోతోంది. ఇంతకు ముందులాగే రెండు రూపాయలకు శుద్ధ నీటిని అందించాలి. ప్రస్తుత ప్రభుత్వంతో ఎమ్మెల్యే మాట్లాడి నీటి శుద్ధి కేంద్రాలు పనిచేసేలా చూడాలి.

- లక్ష్మీనరసమ్మ, ఓడీచెరువు

నిధుల కొరతతో ముందుకు సాగలేదు

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి గత ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో ముందుకుసాగలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. నీటిశుద్ధి కేంద్రాల ద్వారా ప్రజలకు ఫ్లోరైడ్ రహిత నీటిని అందించేందుకు కృషి చేస్తాం.

- గంగాధర్, జేఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఉచితం దేవుడెరుగు ఉన్నది గల్లంతు



ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోంది. నాయకులు చెప్పిన హామీలకు అధికారులు విరుద్ధంగా చేస్తున్నారు. గతంలో హిందూపురం నుంచి బెంగళూరుకు దాదాపు 8 బస్సు సర్వీసులు నడిపేవారు. ఇప్పుడు వాటన్నింటిని తొలగించారు. అద్దె బస్సులను ఆపేశారు. దీంతో బెంగళూరుకు ఆర్టీసీ బస్సులు లేకుండాపోయాయి. ఉచిత బస్సులు దేవుడెరుగు, ముందు రెగ్యులర్ సర్వీసులు సక్రమంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

- బెంగళూరుకు బస్సులులేక ప్రజల ఇబ్బందులు
- అసౌకర్యాల నడుమ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- నిరీక్షించి వెనుదిరిగి వెళుతున్నప్రయాణికులు
- టైం టేబుల్‌లో ఉన్న సర్వీసులు ఏమయ్యాయని ప్రశ్న
- రెగ్యులర్ సర్వీసుల ఏర్పాటుకు వినతి



టైం టేబుల్‌లో కనిపిస్తున్న సర్వీసులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ఎప్పుడూ ఏదో ఒక సాకు చూపి సంస్థ నష్టాల్లో ఉందని చెబుతుంటారు. ఇతర ప్రైవేట్ బస్సులేమో లాభాల్లో నడుస్తాయి. ఇందుకు కారణాలేంటో ఎవరికీ అర్థం కాదు. అదే సాకుతో హిందూపురం డిపో నుంచి ప్రస్తుతం బెంగళూరు మహా నగరానికి నడుస్తున్న బస్సులన్నింటినీ ఆపేశారు. ప్రస్తుతం హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్లాలంటే ప్రైవేట్ బస్సులు, లేదా కర్నాటక ఆర్టీసీ బస్సులు మాత్రమే గతి. గతంలో దాదాపుగా 8 సర్వీసులు నడిపేవారు. ఇప్పుడు ఆ సర్వీసులన్నింటినీ తొలగించారు. హిందూపురం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వివిధ పనులు, ఉద్యోగాల నిమిత్తం వందలాది మంది ప్రజలు బెంగళూరులో ఉంటున్నారు. శని, ఆదివారాలు సెలవులు కావంతో వారందరూ హిందూపురం వచ్చి ఆదివారం సాయంత్రం బెంగళూరుకు వెళ్లాలని భావిస్తారు. ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తే సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల దాదా వేచినా ఒక్క బస్సుకూడా ఉండదు. దీంతో నిరీక్షించి నీరసించి వెళ్లిపోతున్నారు. కనీసం బెంగళూరుకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు లేవనే సమాచారం తెలియజేసే బోర్డులు ఎక్కడా కనిపించడంలేదు. బస్సులు లేవనే విషయం తెలియని ప్రయాణికులు అమాయకంగా వేచి ఉంటున్నారు. అందునా మహిళల పరిస్థితి వర్ణనాతీతం. నాలుగు గంటలకు వచ్చి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో రాత్రి పూట ప్రయాణం మంచిది కాదని తల్లిదండ్రులు ఆడపిల్లలను వెనక్కు తీసుకువెళ్తున్నారు.

కర్నాటక బస్సులు మాత్రం వచ్చిన రెండు నిమిషాల్లోనే ఫుల్ అవుతున్నాయి. ఆంధ్ర ఆదాయం అంతా కర్నాటక బస్సుల పరం అవుతోంది. ఆంధ్ర బస్సులు ఎందుకు నడపడం లేదంటే బస్సులు ఫుల్ కావడంలేదు, నష్టం వస్తోందని కుంటి సాకులు చెబుతున్నారు. కర్నాటక బస్సులకు వచ్చే ఆదాయం, ఆంధ్ర బస్సులకు ఎందుకు రావడంలేదని ప్రజలు నిలదీస్తున్నారు. రెండు వారాల క్రితం ప్రయాణికులు డిపో వద్ద గొడవ చేశారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్, కర్నాటకబస్సుల యాజమాన్యంతో లాలూచీ పడ్డారా? అన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. బెంగళూరుకు బస్సుసౌకర్యం కల్పించలేని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్న సర్వీసులు తొలగించారు



గతంలో హిందూపురం నుంచి బెంగళూరుకు గంట గంటకు ఒక బస్సు నడిచేది. బ్రహ్మాండంగా ఆదాయం కూడా వచ్చేది. ఆ బస్సులన్నీ తొలగించారు. వాటిని తొలగించడంతో అటు ప్రయాణికులు ఇటు ఆర్టీసీ ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

రాజారెడ్డి, ఎన్ఎంయూ

రెండు అద్దె బస్సులు నడుపుతున్నాం

ప్రస్తుతం రెండు అద్దె బస్సులు నడుపుతున్నాం. అయితే గత కొద్ది రోజుల క్రితం ఒక బస్సుకు ప్రమాదం జరిగింది. ఇంకో బస్సు సక్రమమంగా నడపడంలేదు. వారికి నోటీసు ఇచ్చాము. ఉన్న రెండు బస్సులకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణీకులకు ఇబ్బంది కలుగుతోంది. సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. -శ్రీకాంత్, డిపో మేనేజర్

ట్రూఅప్ చార్జీల భారాన్ని ఉపసంహరించండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

పెనుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ట్రూ అప్ విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు హరి, సీపీఐ నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై మోపిన 15,441కోట్ల రూపాయల ట్రూఅప్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఏకపక్షంగా తీసుకునే నిర్ణయం చట్టరీత్యా నేరమన్నారు. ఎన్నికల ముందు పారదర్శకత వినియోగదారుల ప్రయోజనాలు కాపాడతామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ పోకడలకు స్వస్తి చెప్పాలన్నారు. విద్యుత్ బిల్లుల చార్జీలు ఉపసంహరించుకునేలా దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సమావేశంలో సివిల్‌సప్లై హమాలీ కార్మికుల సంఘం నాయకులు నాగరాజు, తిప్పన్న, ఊతప్ప, అల్‌కౌసర్ ట్రస్ట్ నాయకుడు మహ్మది, జేవీవీ నాయకుడు ఇలియాజ్, అంగనవాడీ నాయకులు బావమ్మ, మునిసిపల్ కార్పెంటర్ నరసింహ, సీపీఐ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

ఎట్టకేలకు లేపాక్షి తూర్పుద్వారం ప్రారంభం

లేపాక్షి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయం తూర్పుద్వారాన్ని ఎట్టకేలకు ఆదివారం సంబంధిత అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రారంభించారు. ఇప్పటిదాకా వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు ఉత్తర ద్వారంలో ఉన్న మెట్లను ఎక్కలేక చాలా అవస్థలు పడుతున్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం లక్షలు వెచ్చించి తూర్పు ద్వారం వద్ద వీల్‌చైర్లకు అనుకూలంగా ర్యాంప్ ఏర్పాటు చేసింది. ఏళ్లు గడిచినా ద్వారాన్ని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ విషయమై నవంబరు 18న ఆంధ్రజ్యోతిలో లక్షలు వెచ్చించినా ప్రారంభంకాని తూర్పు ద్వారం అన్న కథనం ప్రచురితమైంది.



తూర్పుద్వారం గుండా వీల్‌చైర్‌ను తీసుకెళ్తున్న దృశ్యం

దీనిపై స్పందించిన అధికారులు తూర్పుద్వారం వద్ద ర్యాంప్‌కు మరమ్మతులు చేపట్టి ఆదివారం మనుగడలోకి తీసుకొచ్చారు. ఈ ర్యాంప్‌ద్వారా వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఆలయంలోకి ప్రవేశించారు. వీల్‌చైర్లలో ఈ ద్వారం గుండా వెళ్లేందుకు అనుకూలంగా ఉండటంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

ముళ్లకంచెలోకి బైక్.. ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ అక్కమ్మగార్ల ఆలయం సమీపంలో కోనాపురం వెళ్లే దారిలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు ముళ్లకంచెలోకి దూసుకెళ్లి కుమార్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మంగాపురంకు చెందిన కుమార్ ద్విచక్రవాహనంలో పట్టణానికి వచ్చి మినరల్ వాటర్‌క్యాన్‌ను స్వగ్రామానికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో అక్కమ్మగార్ల ఆలయ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అక్కడే ఉన్న ముళ్లకంచెలోకి దూసుకెళ్లాడు. స్థానికులు గమనించి అతన్ని వైద్యం కోసం పెనుకొండకు తరలించారు. కోనాపురం రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న రహదారిలో ముళ్లకంచెలు వేయడం ఎంతవరకు సబబని గ్రామస్థులు మండిపడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి ముళ్ల కంచెలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కర్ణాటకలో గోరంట్ల వాసి మృతి



హరి (ఫైల్)

గోరంట్ల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్లాలచెరువు గ్రామానికి చెందిన బోయ హరి (23) కర్ణాటకలోని తూముకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతిచెందారు. ఇదే ప్రమాదంలో బెల్లాలచెరువుకు చెందిన సూర్యప్రకాష్, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. బోయ క్రిష్టప్ప రెండవ కుమారుడైన హరి బెంగుళూరులోని మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. బెల్లాలచెరువుకు చెందిన కురబ అప్పయ్య మనవరాలి పెళ్లి తూముకూరులో నిర్వహించారు. వివాహానికి హాజరవ్వాలని హరితోపాటు బెల్లాలచెరువుకు చెందిన సూర్యప్రకాష్, సురేష్‌లు ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై వెళ్లారు. తూముకూరు వద్ద గుర్తు తెలియన వాహనం ఆ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో హరి అక్కడిక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాష్, సురేష్‌లను తూముకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూర్యప్రకాష్ కోమాలోకి వెళ్లడంతో బెంగుళూరు ఆసుప్రతికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈసంఘటనతో బెల్లాలచెరువు గ్రామంలో ఆదివారం విషదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

హిందూపురం అర్బన్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలకుంట వద్ద ఓ క్యాంటర్ వాహనం చెట్టును ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ కర్ణాటకలోని గౌరిబిదనూరు తాలూకా మల్లేపల్లికి చెందిన రమేష్ (30) అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా వాహనం కర్ణాటక గౌరిబిదనూరుకు చెందినదిగా చెబుతున్నారు.

శబరిమలకు బయలుదేరిన మాలధారులు

అగళి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అగళి మండలం డొక్కలపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి మాలధారులు ఆదివారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఆ గ్రామంలోని బసవన్న దేవాలయంలో గురుస్వాముల చేత అయ్యప్పస్వాములు ఇరుముడి కట్టించుకుని శబరి యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, జెడ్పీటీసీ ఉమేష్ హాజరయ్యారు. గుండుమల మాట్లాడుతూ స్వాములు ప్రయాణ సమయంలో జాగ్రత్తగా వెళ్లి అయ్యప్పస్వామి దర్శనం చేసుకుని క్షేమంగా రావాలని కోరారు. ప్రతి అయ్యప్పస్వామికి పూలమాలలువేసి ఘనంగా సన్మానించారు. యాత్ర సుఖప్రదం కావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా 13మంది అయ్యప్పలు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండల కన్వీనర్ కుమారస్వామి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్‌తోపాటు గ్రామస్థులు స్వాములను సాగనంపారు.

ప్రశాంతంగా పరీక్షలు

పెనుకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ పట్టణంలో 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకార వేతనం పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో రెండు కేంద్రాలు బాలికల ఉన్నత పాఠశాలలో 1, ప్రభుత్వం సెంట్రల్ స్కూల్‌లో ఒకటి, మొత్తం నాలుగు కేంద్రాల్లో 968మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 55మంది గైర్హాజరయ్యారు. 910మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ తెలిపారు.

మహిళపై దాడి

గోరంట్ల, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం. కొత్తపల్లికి చెందిన తన ఇంటిని కాజేయాలని సూర్యనారాయణ కుటుంబ సభ్యులు తనపై దాడిచేసి, కొట్టారని, బాధితురాలు రామాంజనమ్మ ఆరోపించారు. సూర్యనారాయణ కుటుంబానికి, రామాంజినమ్మకు మధ్య గత కొంతకాలంగా ఇంటివివాదం నడుస్తోంది. రామాంజనమ్మ ఇంటిని ఆమె వారసులు తమకు విక్రయించారన్న వివాదం కోర్టులో నడుస్తోంది. తన ఇంటి ముందు పశువుల కట్టేసి ఇళ్లు వదలాలంటూ సూర్యనారాయణ, అతని భార్య సుబ్బమ్మ, కుమారుడు నరేంద్రలు తనపై ఒత్తిడి తెస్తున్నారని, రామాంజనమ్మ గోరంట్ల పోలీసు స్టేషన్‌లో ఆదివారం సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ బాబు దర్యాప్తుకోసం గ్రామానికి వెళ్లే సమయంలో సూర్యనారాయణ కుటుంబ సభ్యులు దాడిచేసి, రామాంజనమ్మను కొట్టడంతో ఆమె చికిత్స నిమిత్తం హిందూపురం వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటనపై ఎస్ఐ బాబు తాను గ్రామానికి వెళ్లే సమయానికి రామాంజనమ్మపై ప్రత్యర్థి వర్గం చేయి చేసుకున్నట్లు చెప్పారు.

హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అమరాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని హేమావతి శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఈసందర్భంగా సిద్దేశ్వరస్వామికి వివిధ అభిషేకాలు, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి, ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాలభైరవేశ్వరస్వామి, శ్రీదొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ మెంబర్ కరేగౌడ్ తెలిపారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణలతో కిట కిటలాడటం విశేషం..

దైవ చింతనతోనే విశ్వశాంతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే విశ్వశాంతి ఏర్పడుతుందని, ప్రజలందరూ దైవ చింతనను అనుసరించి నడుచుకోవాలని త్రైతత సిద్ధాంత ప్రబోధ సమితి జ్ఞాన వేదిక ముద్దిరెడ్డిపల్లి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవకులు భగవద్గీత సిద్ధాంతాలు, వాటి విలువలు ప్రజలకు తెలియజేశారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజలు సుఖంగా ఉంటారని వివరించారు. చిన్న మార్కెట్ ప్రాంతంలో గీత బోధనలు వివరించారు. కార్తీక మాసం ముగిసి మార్గశిర మాసం వచ్చిందని మార్గశిర మాసం విష్ణువుకు ప్రీతికరమైనదన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆదినారాయణ, సుభద్ర,మమత, పార్వతి, కళ, సుబ్బమ్మ, సరస్వతి, విద్య, సంధుజ, కోనమ్మ, శేఖర్, కిష్టప్ప, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

13 నుంచి భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాలు

మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల13 నుంచి 19 వరకు జరుగుతాయని దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. 13న స్వామివారి ధ్వజారోహణం, అంకురార్పణ, 14న స్వామివారి కళ్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం, 16నజ్యోతుల పరుష, భూతప్పల ఉత్సవం, 17న తలనీలాలు, 18న కంబాల నరసింహస్వామి పరుష, శయనోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 19న వసంతోత్సవం, స్వామి చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆర్టీసీబస్సులు కూడా ఏర్పాటుచేస్తున్నామన్నారు. భక్తులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి గుండుమల సంతాపం



వీరకేతప్ప కుటుంబసభ్యులను ఓదారుస్తున్న తిప్పేస్వామి

మడకశిర రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని గంతలపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు వీరకేతప్ప అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆయన ఆదివారం ఆగ్రామానికి వెళ్ళి వీరకేతప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు.టీడీపీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శివాలయానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న డా. సురేంద్ర

చిలమత్తూరు,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో మొరంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డా. సురేంద్ర రూ. 2 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం గ్రామంలో నూతన శివాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామస్థుల ఆహ్వానంతో డా.సురేంద్ర హాజరయ్యారు. ప్రతిఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని, ఆధ్యాత్మికంగా బలపడితే జీవితంలో ప్రతి సమస్యకు మార్గం దొరుకుతుందన్నారు. ఆలయ నిర్మాణంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పాలు పంచుకోవడం మరింత ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, శ్రీదేవి, సోమశేఖర్, నందీషప్ప, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పరిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో పూజారి పుండరికాక్ష జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌కు అనూహ్యస్పందన లభించింది. సేవామందిరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి చెందిన వైద్యులు శివకుమార్, శ్రీఆరోగ్య ఆసుపత్రి ఎండీ తారక్‌నాథ్, అశ్విన్ మహేంద్ర, సంతోష్‌లు 220మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ రంగడుయాదవ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఎన్‌లైట్ ప్రిన్సిపాల్ సురేష్ హాజరయ్యారు.

ఘనంగా కనకదాస జయంతి



జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు

లేపాక్షి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని మండలంలోని కల్లూరు, నాయనపల్లి గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కనకదాస చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో జ్యోతులు తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం కనకదాస చిత్రపటానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

బృందావనంలో పూజలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం సమీపంలో బృందావనం సమీపంలో వెలసిన శ్రీకర నారాయణస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి ఆలయంలో అనంతపురం వాసులు కామాక్షి, సుజాత, ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గోపూజ, కలశస్థాపన, మహాపూర్ణాహుతి, అగ్నిహోమం, చండియాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతచార్యులు, శ్రీకాళహస్తి, వరదాచార్యకరణం, వాదిరాజగోచార్యలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సమర్పణ



విరాళం అందజేస్తున్న బేవనహళ్లి ఆనంద్‌కుమార్

హిందూపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని సడ్లపల్లిలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్‌కుమార్ రూ.10వేలు విరాళాన్ని అందజేశారు. ఆదివారం సడ్లపల్లికి చెందిన గ్రామస్థులు ఆలయ నిర్మాణానికి సహాయం అందించాలని ఆనంద్‌ను కోరగా కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి మంత్రి పరామర్శ



తులసమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మునిమడుగు గ్రామంలో టీడీపీ కార్యకర్త వెంకటనారాయణ భార్య తులసమ్మ శనివారం హఠాన్మరణం చెందడంతో బీసీసంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదివారం ఆమెకు ఘననివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తాము అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనంతరం అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట గుట్టూరు చిన్నవెంకటరాముడు, మండల కన్వీనర్ శ్రీరాములు, సిద్దయ్య, మల్లికార్జున, రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

ఉరుసుకు మంత్రికి ఆహ్వానం

పెనుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెనుకొండలో జరిగే బాబయ్యస్వామి గంధం ఉరుసుకు రావల్సిందిగా బీసీసంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా ఆహ్వానించారు. ఆదివారం ఆమె స్వగృహంలో నిర్వాహకులు ఆమెను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 13న బాబయ్యస్వామి ఉరుసు, గంధం జరుగుతుందని 752వ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హిందూపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసుదన్‌రెడ్డి అన్నారు. హిందూపురం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల ఆవరణంలో ఆదివారం జనసేన పార్టీ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకం మధుసుదన్‌రెడ్డి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు డా.సురేంద్ర, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుల ఉమేష్‌లు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ఎకడ్బందీగా నిర్వహిస్తున్నారన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా 600మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, బాలాజీ, పట్టణ అధ్యక్షుడు రమేష్, టీడీపీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ట్రాఫిక్ బెడద



ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

పెనుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ ప్రధాన రహదారి శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకు ట్రాఫిక్ నియంత్రించే వారేలేరా అని ప్రజలు మండిపడుతున్నారు. ఆదివారం ట్రాఫిక్ జామ్ అయి గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. పెనుకొండ డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్‌ను అరికట్టకపోవడంతో కొన్నేళ్లుగా వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండ పట్టణానికిప్రధాన రహదారి అయిన ఈ రహదారిలో వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ అరికట్టాలని కోరుతున్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో మడకశిర జట్టు ప్రతిభ



రన్నరప్‌గా నిలిచిన మడకశిర ఫుట్‌బాల్ జట్టు

మడకశిరటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ, ఏఎస్‌పే ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం ఆర్డీటీ మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లా మండలస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మడకశిర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్‌లో హిందూపురం, మడకశిర జట్లు తలపడ్డాయి. హిందూపురం జట్టు విజేతగా, నిలవగా.. మడకశిర రన్నరప్‌గా నిలిచాయి. జిల్లాస్థాయి పోటీల్లో మడకశిర జట్టు రన్నరప్‌గా నిలవడం పట్ల మడకశిర ఫుడ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు నాగభూషణ, నవీద్, బాలాజీ, జగదీష్ తదితరులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో యాగం



యాగాలు నిర్వహిస్తున్న వేద పండితులు

పెనుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొండాపురం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీకాంత తీర్థ బృందావనంలో ఆదివారం బృహత్ సహస్రయాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మనూరు ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాగంలో అశేష సంఖ్యలో భక్తులుపాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

మడకశిరటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇటీవల నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.